కాంతిరేఖ

■ ఆరోజు వచ్చిన వుత్తరాలను చూస్తూ మేడ మీద వాలుకుర్చీలో కూర్చున్నారు గంగాధరంగారు రోజులాగే, ఆయన దాన ధర్మాలను అందుకున్న వారివద్దనుంచి కృత జ్ఞతలు తెలుపుతున్న లేఖలూ, అనేక వ్యాపార సంబంధమయిన వుత్తరాలు చూసి ప్రక్కన పెడుతున్న ఆయన్ని ఓ వుత్తరం కంగారుపెట్టింది అది అతిసాధారణమయిన కాగితం మీద వ్రాయబడిన వుత్తరం. ఆత్రంగా ఆయన కళ్ళు అక్షరాల బారులపై పరుగులుతీసాయి.

ప్రియమైన మీకు,

ఇంతకంటే మిమ్మల్ని ఎలా సంబోదించాలో తెలియటంలేదు. సుమారు యిరవై సంవత్సరాల క్రితంనాటి పార్వతిని మీరు మరచిపోయివుండరనే నమ్మకంతో యీ వుత్తరం వ్రాస్తున్నాను. మీతో చెప్పవలసినది చాలా గుండెల్లో దాచుకుని, మృత్యువుకు అతి దగ్గరలోవున్న నేను యీనాడు పూర్తిగా నా ఓటమి నంగీకరిస్తూ మీ రాకకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నాను ప్రస్తుతం నేను వున్నది మదనపల్లి శానిటోరియంలో. మీరు ఎంత త్వరగా వస్తే అంత అదృష్టవంతురాలిని నేను.

ఒకనాటి మీ
పార్వతి.

'పార్వతి' గంగాధరంగారి పెదాలు అస్పష్టంగా గొణిగాయి. బరువుగా వూపిరి పీలుస్తూ కుర్చీకి చేరబడి రెండుచేతుల్లో ముఖం దాచుకుని వుండిపోయారాయన.

* * *

మదనపల్లి శానిటోరియంలో పార్వతిని వెదకటం కష్టంకాలేదు గంగాధరంగారికి. కాని తీరా మంచం దగ్గరకు వచ్చేసరికి ఆమెను పోల్చుకోవటమే కష్టమయింది.

వయసు నలభైలోపు అయినా అరవైయేండ్లదానిలా వుందామె. తెల్లగా పాలిపోయి వుంది. వంట్లో ఎముకలు, వాటిని కప్పుతూ చర్మం తప్ప మనిషికి అందం, ఆకారం యిచ్చే కండ ఎక్కడా కనిపించటంలేదు. సగం తెల్లబడ్డ జుట్టు నుదుటి మీద చిందర వందర పడివుంది మూసివున్న కనురెప్పలు విశాలంగా వున్నాయి. వాటి క్రింద ఆమె గత జీవిత చిహ్నాలుగా మిగిలి వున్న నల్లని చారలు.

తడబడే అడుగులతో దగ్గరగా వెళ్ళి వణికే స్వరంతో 'పార్వతీ' అంటూ మెల్లగా పిల్చారు గంగాధరంగారు.

నాగస్వరం విన్న నాగులా, విన్నాళ్ల నుంచో ఆ పిలుపుకే వేచివున్నదానిలా, చటుక్కున కళ్ళు తెరిచిందావిడ

నాలుగు కళ్ళు క్షణంసేపు కలిసాయి. సంతోషం, తృప్తి వ్యక్తంచేస్తూ ముత్యాల్లాంటి కన్నీరు కురిసిందామె కళ్ళనుంచి. అణచుకోలేని బాధను సూచిస్తూ ఆయన కండ్లు చెమర్చాయి.

'వచ్చారా! నాకు తెలుసు మీరు తప్పకుండా వస్తారని.'

'పార్వతీ' అంతకంటే ఆయన కంఠం నుంచి మాటలు రావటంలేదు.

'ఇలా కూర్చోండి, మీతో చాలా చెప్పాలి' అందామె ప్రక్కనేవున్న చిన్న స్టూలు చూపిస్తూ.

ఆ నుదుటి మీది జుట్టు వెనక్కు సర్ది, ఎండిపోయి పుల్లల్లావున్న ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని 'నేను వచ్చాను పార్వతీ, నిన్ను బ్రతికించుకుంటాను, ధైర్యంగా వుండు' అని చెప్పాలనిపించిందాయనకు. కాని అందుకు అవకాశం యివ్వకుండా ఆమె మాట్లాడటం మొదలెట్టింది.

'ఆయన పదేళ్ళక్రితం గుండె జబ్బుతో పోయారు. మాకంటూ ఆయన మిగిల్చింది అది ఒక పెంకుటిల్లు మాత్రమే. అప్పటినుంచి కుట్టుమిషను మీద పనిచేస్తూ కాలం గడిపాను. మూడేళ్ళక్రితంనుంచి పట్టుకుందీ జబ్బు. ఆ వున్న యిల్లు నా వైద్యానికే చెల్లిపోయింది. నేను పోతే రాజును ఎవరు చూస్తారు......

'రాజా అంటే నీ...'

'నా ఒక్కగా నొక్క కొడుకు రాజా, వాడితర్వాత నాకు పిల్లలు పుట్టలేదు' అందామె.

గంగాధరంగారి కళ్ళు మెరిసాయి 'అంటె రాజా మన...' సగంలో ఆగిపోయారు.

ఆసక్తిగా తన కళ్లలోకి చూస్తున్న ఆయన ముఖంనుంచి తన చూపులు ప్రక్కకు మరల్చుకుని 'అవును' అందామె.

ఆ జవాబుతో, పచ్చగా దబ్బ పండు ఛాయలోవున్న ఆయనముఖం ఎర్రబడింది. పొంగిపొరలే సంతోషాన్ని అణచుకోవటానికి వ్యర్థప్రయత్నం చేస్తూ 'ఆ బ్బాయి యిప్పుడెక్కడున్నాడు పార్వతీ' అన్నారు.

'ఈ వూరిలోనే వున్నాడు. సత్రంలో వుంటున్నాడు, కొంచెంసేపట్లో వస్తాడు. వాడు రాకముందే మనం అన్ని సంగతులు మాట్లాడుకోవాలి' అందామె.

'ఆనాడు మీమీద కోపంతో నేను పెట్టిన షరతుప్రకారం ఆయన పోయినప్పటినుంచి కటిక దరిద్రం అనుభవిస్తున్నా మిమ్మల్ని సహాయం అర్థించలేదు కాని జీర్ణించిపోయిన నా రక్తమాంసాలతోపాటు ఆనాటి నా పట్టుదల కూడా మాసిపోయింది. నేనింక ఎన్నో రోజులు బ్రతకను. రాజును మీచేతుల్లో పెడుతున్నాను. వాడిని డాక్టరు చదివించండి. అయితే ఏ పరిస్థితులలోను రాజుకు మనసంగతి తెలియకూడదు. మిమ్మల్ని వాళ్ల నాన్న స్నేహితునిగా పరిచయం చేస్తాను. మీరు అలానే ప్రవర్తించాలి. నామాట నెరవేరుస్తానని నాకు ప్రమాణం చేయండి' అంటూ చెయిచాపిందామె.

'వద్దు పార్వతీ, ఆపనిమాత్రం చేయలేను. వారసుల్లేని నాకు వరప్రసాదంలా కొడుకునిస్తూ, వాడితో 'నాన్న' అని పిలిపించుకోలేని నిర్భాగ్యుడిని చేయకు నన్ను' అన్నారు గంగాధరంగారు దీనంగా.

'మీకు పిల్లలు పుట్టలేదా'

'లేదు, సావిత్రి నోచని నోములేదు. చేయని వ్రతంలేదు, దర్శించని పుణ్యక్షేత్రంలేదు; అయినా నా పాపం యీనాటి శాపంగా మారి నన్ను తండ్రిని కానీయలేదు.

'బాధ పడకండి రాజాకు నేనంటె చాలా ప్రేమ, గౌరవం. వాడికి నా గతం తెలిసి వాడి దృష్టిలో నా విలువ తగ్గించుకోవటం నా చావు తర్వాత కూడా నేను భరించలేను. లోకానికి తెలిసినా తెలియకపోయినా మీకు తెలిసింది మీ గుండెల్లో దాచుకుని తండ్రిగా మీ కర్తవ్యం నెరవేర్చండి. అదే నాకు తృప్తి' అందామె కళ్ళు మూసుకుంటూ. ఎక్కువగా మాట్లాడటం వలన అలిసి పోయినట్లుయి శ్వాస తీవ్రమయింది.

ఇక ఆవిడను మాట్లాడించటం మంచిది కాదనుకుని 'అలాగే పార్వతీ నీ మాట ప్రకారమే జరుగుతుంది' అన్నారు గంగాధరంగారు దృఢమైన కంఠంతో.

తృప్తిగా నిట్టూర్చి కళ్ళు మూసుకుందామె. అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు' తరచూ మీ గురించి పత్రికలలో వ్రాసే వార్తలు చదువుతూ వుంటాను. మీ దయా గుణాన్ని మంచి తనాన్ని ప్రశంసిస్తూ వ్రాసే వ్యాసాలు, ఫోటోలు చూసి చాలా సంతోష పడేదాన్ని' అందామె.

'వారసుల్లేని ఆస్తిని మంచి పనులకు వుపయోగించటం ఏమంత గొప్పపని కాదు పార్వతీ' అన్నారాయన

అంతలో ఓ పద్దెనిమి సంవత్సరాల యువకుడు వచ్చాడక్కడకు. గంగాధరంగారి కళ్ళు అతన్ని పరిశీలనగా చూచాయి. పచ్చగా, తెల్లగా వున్నాడు. విశాలమైన నుదురు నొక్కుల జుట్టు. సన్నని మీసాల క్రింద పల్చని పెదాలు విశాలమైన కళ్ళు దిగులుతో కళావిహీనంగా వున్నాయి. ఆసక్తిగా అతన్ని పరికించిన గంగాధరంగారు 'అచ్చు తల్లి పోలిక' అనుకున్నారు మనసులో.

రెండు చేతులూ చాచి అతన్ని దగ్గరకు లాక్కుని గుండెలకదుముకుని 'నేను నీ తండ్రిని బాబూ' అని చెప్పాలనిపించే కోర్కెను తప్పనిసరిగా అణచుకుంటూ పార్వతి వైపు చూపులు మరల్చుకున్నారాయన.

తన తల్లి దగ్గర వున్న నూతన వ్యక్తిని చూసి, 'ఎవరూ' అన్నట్లు ప్రశ్నార్థకంగా తల్లివైపు చూశాడు రాజా.

'రాజా! వీరు గంగాధరంగారు. మీ నాన్నగారి ప్రాణస్నేహితులు. నేను యిక్కడ వున్నట్లు తెలిసి చూడాలని వచ్చారు' అంది పార్వతి

'నమస్కారం' వినయంగా చేతులు జోడించాడు రాజా.

సమాధానంగా తలపంకిస్తూ 'ఏం చదివావు బాబు' అన్నారు.

'పి. యు. సి, పాసయ్యానండి.'

'ఆ తర్వాత......' అంటూ ఆగిపోయాడు.

అతను చెప్పబోయేది తనకు తెలుసు నన్నట్లు 'పర్వాలేదు బాబు, యింకా చదువుకుందుగాని' అన్నారు లాలనగా.

పార్వతికోసం గంగాధరంగారు ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ప్రయోజనం లేకపోయింది. ఇక తనపని అయిపోయిందన్నట్లు ఓ ఉదయాన కొడుకువడిలో

ప్రాణం వదిలిందామె తల్లి మరణానికి కుమిలిపోతున్న రాజును ఓదార్చి తన వెంట తెచ్చుకున్నారు గంగాధరంగారు.

* *

పుట్టినప్పటినుంచి దరిద్రాన్నే అనుభవించిన రాజును గంగాధరంగారి ఐశ్వర్యం, ఆదరణ కొంత కలవరపరచాయి. సులభంగా రాజుకు మెడిసన్‌లో సీటు సంపాదించారు. ప్రత్యేకంగా అతనికోరకు ఓగది, అతని పనులు చేయటానికి ఓనౌకరు. కాలేజీకి పోయిరావటానికి కారు. ఖరీదయిన బట్టలు. తన తండ్రి స్నేహితునిగా తనపై గంగాధరంగారు చూపుతున్న అపరిమితమైన వాత్సల్యం రాజును మొదట్లో ఒక విధంగా భయపెట్టినా కాల్రకమేణా అలవాటుపోయింది. అంతేగాక ఆ యింటి యిల్లాలు సావిత్రిలో తన తల్లిని చూసుకుని గతం పూర్తిగా మరచిపోగలిగాడు.

రాజుకు ఆ యింటలభించే ఆదరణలో తనూ భాగం తీసుకుంటున్నప్పటికీ, ఆ అబ్బాయిపట్ల తన భర్త ప్రవర్తనకు కారణం కనుక్కోవాలనే పట్టుదల పెరగసాగింది సావిత్రిలో.

* * *

రాత్రి భోజనాలు అయినాక, మేడమీద బాల్కనీలో కూర్చుని, ఆకాశంలో తారల్ని చూస్తూ, భార్య అందించే తమలపాకులు నమలటం గంగాధరంగారి దినచర్యల్లో ఒకటి.

బాంధవ్యరహితులు

రోజులాగే ఆవేళ వక్కపొడి అందిస్తూ 'మిమ్మల్ని ఒకటి అడుగుతాను, నిజం చెప్తారా!' అంది సావిత్రి.

భార్య అడగబోయేదేమిటో అప్పుడే అర్థం చేసుకున్న గంగాధరంగారు ఆమె కళ్లల్లోకి చూస్తూ 'అడుగు సావిత్రీ,' అన్నారు.

'రాజంటె మీకు ఎందుకంత ప్రేమ, అతన్ని చూడందే ఒక్కరోజు వుండలేరు. ఇంతకుముందు మీ రెంతో మందికి సాయం చేసారు. కాలేజీఫీజు కట్టడమో, ఒకపూట మనింట్లో భోజనం ఏర్పాటు చేయటమో జరిగేదిగాని, యీ అబ్బాయిపట్ల మీ ప్రవర్తన నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రతి రోజు ఉదయాన్నే స్వయంగా మీరే అతన్ని నిద్రలేపటం, రాత్రి నిద్రపోతున్న వాడ్ని చూస్తూ నిల్చోవటం నేను గమనించకపోలేదు' అందామె.

ఒక్క క్షణం మౌనంగా వుండిపోయారాయన.

'ఈ ప్రశ్న నీవడగవలసిందీ, అడగకపోయినా నేనే చెప్పవలసిందే సావిత్రీ, నీ దగ్గర నిజం దాచేశక్తి నాకులేదు సావిత్రీ, నిజం తెలిసిన తర్వాత నన్ను క్షమించినా, అసహ్యంచుకున్నా నేను చేసేదేమి లేదు. రాజు ఎవరోకాదు. స్వయాన నా రక్తం



పంచుకుని పార్వతికి పుట్టిన బిడ్డ' అంటూ భార్య ముఖంలోకి చూశారు. ఆయనను కున్నట్లు ఆమె ముఖం పాలిపోలేదు. కనుబొమలు ముడిపడలేదు. పైగా నిర్మలమయిన చిరునవ్వు చిందిస్తూ 'ఊ, కానివ్వండి' అంది.

'సుమారు పందొమ్మిది సంవత్సరాల క్రితం సంగతి అప్పట్లో నేను విశాఖపట్నంలో ఎం. ఎ. చదువుతున్నాను. జగన్నాథం నా ప్రాణస్నేహితుడు. చాలా పేదవాడు వాడికి కాలేజీ ఫీజు, అదీ నేనే కట్టుండేవాడిని. మేమిద్దరం ఓగది తీసుకునివుంటూ వుండేవాళ్లం. ఆయింటి గలవారి అమ్మాయే పార్వతి.

పద్దెనిమిది సంవత్సరాల వయసులో, పచ్చగా, పెద్ద పెద్ద కళ్లతో, మొదటిసారి నా కంటబడినప్పుడు, చాలా చురుకయినది అనుకున్నాను. రెండవసారిచూసి ఎంతో అందమయిందనుకున్నాను. ముచ్చటగా మూడవసారిచూసి పలకరించకుండా వుండలేకపోయాను, ఆ పలకరింపు క్రమంగా, స్నేహంగా, ప్రేమగా, మారింది ఆతర్వాత హద్దులు మీరిన ప్రణయంగా మారి పరవళ్లు తొక్కింది.' చెప్తున్న ఆయన మొఖంలో ఆనాటి మధురస్మృతుల జ్ఞాపకాల తళతళలు కనిపించాయి పార్వతికి.

'జగన్నాథం మొదట్నుంచి మమ్మల్ని గమనిస్తూనే వున్నాడు. నన్ను హెచ్చరిస్తూనే వున్నాడు. కాని పరువపు గర్వంలోవున్న నాకు వాడి నీతిబోధ చెవికెక్కలేదు. ఫలితం పార్వతి గర్భవతి అయింది. అప్పటికే నాలుగు నెలలు గడిచాయి.

పరీక్షలు అయ్యాక సెలవలకు యింటికి వెళ్లిన నేను పార్వతిని పెళ్లి చేసుకుంటానని అమ్మకు, నాన్నకు చెప్పాను. నాన్న మాట్లాడలేదు. ఆయన చాలా గంభీరులు, పైకి తేలని మనిషి కాని అమ్మ ససేమిరా వప్పుకోలేదు. అమ్మ సంగతి నీకు తెలుసుకదా! పట్టి పూర్వాచారం మనిషి, పైగా ఛాందసురాలు. పూజలు, మడులు, వ్రతాలు అంటూ చాలా నిష్టగావుండేది. తన కోడలు అటువంటిదే అయివుండాలి ఆమె కోరిక. అందుకే స్వద్బ్రాహ్మల కుటుంబంలోకి ఒక కమ్మవారి అమ్మాయి కోడలుగా రావటానికి వప్పుకోలేదు. పైగా తనను కాదని

ఆ అమ్మాయిని పెండ్లాడితే తను నుయ్యో, గొయ్యో, చూసుకుంటానని శపథం పట్టింది. తన చెల్లెలు కూతురయిన నిన్ను తనకోడలు చేసుకోవాలనే గాఢమయిన కోరికతో న్యాయాన్నే మరచిపోయి తటస్థంగా వుండిపోయారు నాన్న. ఓ వైపు నన్ను నమ్ముకుని కాదంటె కాలగర్భంలో కలిసిపోవటానికి తయారుగా వున్న పార్వతి. మరోవైపు తన మూర్ఖపు పట్టుదలతో ప్రాణాలు తీసుకుంటానని బెదరించే కన్నతల్లి. అటువంటి విపరీత పరిస్థితులలో జగన్నాథం నాకు దారిచూపించాడు. నేను తనకు ఆర్థికంగా చేసిన సహాయానికి కృతజ్ఞతగా చేయని నేరం మీద వేసుకుని పార్వతిని తను పెండ్లాడతానన్నాడు. విధికి తలవంచక తప్పలేదు నాకు. జగన్నాథమే స్వయంగా పార్వతికి అన్ని విషయాలు వివరించాడు. పార్వతి మొదట ఒప్పుకోలేదు. నన్ను అన్నివిధాల నిందించింది. మోసగాడిని, పిరికివాడిని అంది. చివరకు మరో మార్గంలేక తన గర్భంలో రూపాలు దిద్దుకుంటున్న బిడ్డకోసం తన నిండు ప్రాణాలు బలిచేయలేక జగన్నాథాన్ని వివాహం చేసుకోవటానికి ఒప్పుకుంది. అయితే నా మీద కలిగిన విపరీతమయిన కోపంతో, అసహ్యంతో, జగన్నాథాన్ని తను వివాహం చేసుకున్నాక, నేను వాళ్లను ఏ పరిస్థితులలోను కలుసుకో కూడదని, తమ వునికి తెలుసుకోవటానికి ప్రయత్నించ కూడదని నా నీడకూడా వాళ్ల మీద పడకూడదని షరతులు పెట్టింది. విధికి మరోసారి తలవంచి, వాళ్ల వివాహం అయిందనిపించి బెజవాడ వచ్చేసాను. మాటకు కట్టుబడి వాళ్లను మరచిపోవటానికి ప్రయత్నించేవాడిని. కాని పార్వతి బిడ్డను అంటె నా బిడ్డను ఒక్కసారి చూసిరావాలని ఎన్నోసార్లు అనిపించేది. మరుక్షణం నిప్పులు క్రక్కుతూ రోషంతో ఎర్రబడిన కళ్లతో నిలబడ్డ పార్వతి మొఖం కళ్లకు కనబడి నా కాళ్లకు బంధం వేసేది.

ఆ తర్వాత నీతో నా వివాహం జరిగటం. ఆ తర్వాత నాన్న వ్యాపారమంతా నేనే చూసుకోవటం నీకు తెలిసిందే. నీవు యీ యింట కాలుపెట్టిన నాటినుంచి వ్యాపారంలో విపరీతమయిన లాభాలు వచ్చి ధనలక్ష్మి యీ యింట నాట్యం చేసింది. కాని పార్వతి శాపం పూరికే పోలేదు. ఎన్ని ధనధాన్యాలు వున్నా నట్టింట చిట్టిపాప నడయాడలేదు. ఆ దిగులుతో అమ్మ పోవటం, ఆ తర్వాత రెండు నెలలకే నాన్న చనిపోవటం జరిగింది. విచారంతో కృంగిపోతున్న నన్ను నీ చల్లని ఆదరణతో సేదదీర్చి ఓ మంచి మనిషిగా దిద్దావు. ఈనాడు సంఘంలో నా కున్న, పేరప్రతిష్టలు పరువు, మర్యాదలు నీ వల్ల లభించినవే.

ఇన్నేళ్ళ తర్వాత పార్వతి నన్ను జ్ఞాపకం చేసుకుంది. మదనపల్లి శానిటోరియంలో మరణశయ్యపై వుండి నాకు కబురు

పెట్టింది. రాజును నా కప్పగించి కళ్ళు మూసింది. అయితే యీ రహస్యం ఎటు వంటి పరిస్థితులలోను రాజుకు తెలియనివ్వ నని నా దగ్గర మాటకూడా తీసుకుంది. రాజా ఏటూ తల్లిలేనివాడు. తండిని పుండీ చెప్పుకోలేని అసమర్థుడిని. వాడిని నీ బిడ్డగా ఆదరించు సావిత్రి' అంటూ కథ ముగించారు గంగాధరంగారు.

'తప్పకుండా, మీరు రాజు విషయంలో బెంగపెట్టుకోవద్దు. వాడిని నా కన్న బిడ్డలా చూసుకుంటాను' అంటూ లేచి తమలపాకుల పళ్ళెం అందుకుంది.

అప్పటికే చాలా ప్రొద్దుపోయినందున గంగాధరంగారు కూడా లేచి ఆమెను అను సరించారు.

* * *

కిటికీలోంచి తొంగిచూసే ఉదయ భానుని లేత కిరణాల వేడికి కళ్ళు తెర చారు గంగాధరంగారు. రాత్రి జరిగిం దంతా ఒక్కసారి జ్ఞాపకం వచ్చింది. గుండెలమీద నుంచి ఎంతో భారం దింపి నట్లయింది. తృప్తిగా నిట్టూరుస్తూ లేచి క్రిందకు నడిచారాయన.

బాంధవ్యారిహితులు

ప్రతిరోజు తెల్లవారగానే క్రిందకు వెళ్లి రాజును లేపటం, రాజు లేవగానే 'గుడ్ మార్నింగ్ సార్' అని చెప్పటం, అలా చెప్పినప్పుడు 'సార్ కాదు రాజా, డాడి అను' అని చెప్పాలని ఎన్నోసార్లు అని పించినా చెప్పలేక పోవటం గంగాధరంగారికి అలవాటయి పోయింది.

రాజు గదిలోకి నడిచిన గంగాధరంగారు అలాగే నిలబడిపోయారు. మంచం మీద రాజు లేడు. అసలు రాజు ఆ మంచంమీద పడుకున్నట్లే లేదు. పరచిన దుప్పటి కొంచెంకూడా నలిగిలేదు. టేబిల్ మీద వెండి చెంబులో నీళ్ళు కదలించకుండా అలాగే వున్నాయి. ఆ ప్రక్కనే ఓ పుస్తకం క్రింద నేనిక్కడ వున్నాను అన్నట్లు గాలికి రెపరెపలాడుతూ ఓ కాగితం ఆయన్ని పలకరించింది.

ఒక్క అడుగులో వాల్ని అందుకుని చూశారు గంగాధరంగారు.

'పూజ్యులైన గంగాధరంగార్కి,

నమస్కారములు, రేపు మా కాలేజీ వాళ్ళంతా పిక్నిక్ వెళ్ళాలనుకున్నాం. అందుకు మిమ్మల్ని డబ్బు అడుగుదామని రాత్రి మీ గదికి వచ్చాను. సావిత్రమ్మ గార్కి, మీకు జరిగే మాటలలో నా పేరు రావటం వలన సహజమయిన కుతూహలంతో, తప్పని తెలిసినా మీ మాటలన్నీ విన్నాను. నిజం తెలిసికూడా ఆత్మవంచన చేసుకుని మీ పంచన వుండలేను. అమ్మ నా క్షేమం కోరి, తను చనిపోయాక నేను అనాథనై అష్టకష్టాలు పడతానని, ఐశ్వర్యవంతు అయిన మీ నీడన సిరిసంపదలతో నా ముందు జీవితం గడుపుకుంటాననే నమ్మ కంతో, మీ సున్నిత హృదయాన్ని సాధ నగా చేసుకుని చెప్పకూడని అబద్ధం చెప్పి మిమ్మల్ని మోసంచేసింది. ఇప్పలాటి నిజం మీకు చెప్తున్నాను. నాకు ఆరేళ్ళ వయ సప్పుడు నాకంటే ఒకే సంవత్సరం పెద్ద వాడయిన గిరిధర్ అన్నయ్య మశూచికం వ్యాధితో మరణించటం, అప్పుడు అమ్మ అనుభవించిన దుఃఖం నేను మరచిపోలేదు. మీకు అర్థం అయివుంటుందనుకుంటాను. మీ రక్తం పంచుకు పుట్టిన గిరిధర్ మరణించాడు. నేను జగన్నాథం కొడు కును నా కోసం, నా సుఖంకోసం అమ్మ చేసిన నేరాన్ని క్షమించమని మిమ్మల్ని వేడుకుంటున్నాను. కన్న కొడుకునని క్షణ క్షణాన మీరు చూపే ఆదరణ, ఆప్యాయ తకు నేను అనర్హుడను. అందుకే యిల్లు విడిచి వెళ్ళిపోతున్నాను. నా కన్నతండ్రి పెట్టిన కొద్దిపాటి విద్యాభిక్షతో నా జీవి తం గడుపుకోగలననే ఆత్మ విశ్వాసంతో వెళ్ళిపోతున్నాను. నన్ను మరచిపొండి.

మీకు ఏమికాని,

రాజా.

వణుకుతున్న ఆయన చేతివ్రేళ్ళను తప్పించుకుని అప్పుడే వీచిన పెద్దగాలికి ఆ వుత్తరం కిటికీలోంచి బయటకు ఎగిరి పోయింది. అంతవరకూ ఆ గది ప్రక్కనే వున్న జామచెట్టుమీద రామచిలుక రెక్కలు విదిల్చి రివ్వున ఎగిరిపోయింది. ●